నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్, ఎన్ఎఫ్‌సీనగర్ 11కేవీ ఫీడర్, హెచ్‌పీసీఎల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు ఘట్‌కేసర్ టౌన్, బుగ్గానగర్, అంబేడ్కర్‌నగర్, హెచ్‌పీసీఎల్, వీబీఐటీ కాలేజ్ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ యశ్వంత కుమార్‌రెడ్డి తెలిపారు.

పోచారం..

విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12:30 గంటల వరకు అన్నోజిగూడ, ఎల్ఎన్ కాలనీ, ఎల్ఐజీ, జైపురికాలనీ, సత్యానగర్, సాయినగర్, ఇందిరానగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైకుంఠధామంలో పారిశుద్ధ్య పనులు

పోచారం: పోచారంలోని వైకుంఠధామంలో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. అన్నోజిగూడ, యంనంపేట్, నారపల్లిలోని వైకుంఠధామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చైర్మన్ కొండల్‌రెడ్డి తెలిపారు.

షెల్టర్ హోమ్‌కు మైనర్ల తరలింపు

ఘట్‌కేసర్: ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ఘట్‌కేసర్ పోలీసులు మున్సిపాలిటీలోని పలు దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు మైనర్ బాలురు, ఒక మైనర్ బాలికతో పని చేయిస్తున్న దుకాణాల యజమానులపై చైల్డ్ లేబర్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. వారిని చైల్డ్ లేబర్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచగా.. షెల్టర్ హోమ్‌కు తరలించారు. అలాగే బుధవారం ముగ్గురు మైనర్ బాలురను షెల్టర్ హోమ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పరశురాం మాట్లాడుతూ.. మైనర్లతో పని చేయిస్తే చైల్డ్ లేబర్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.1.50 లక్షలు పలికిన వెంకన్న లడ్డూ

మేడ్చల్‌రూరల్: మండల పరిధిలోని క్షేత్రగిరి వేంకటేశ్వర స్వామి లడ్డూ రూ.1 లక్షా 50 వేలు పలికింది. వేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా స్వామివారికి పెట్టిన లడ్డూను గురువారం ఆలయ అధికారులు వేలం పాట నిర్వహించగా రాజబొల్లారం తండాకు చెందిన రమేష్ నాయక్ వేలంలో దక్కించుకున్నారు.

అభినందనలు



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పీఎస్‌లో నూతన ఎస్సైలను ఇన్‌స్పెక్టర్ పరశురాం, డీఐ శ్రీనివాస్ గురువారం వారికి అభినందనలు తెలియజేశారు. మూడు నెలల పాటు ఇంద్రారెడ్డి, మహేందర్ సబ్ ఇన్‌స్పెక్టర్ శిక్షణ పూర్తి చేసుకొని తిరిగి పీఎస్‌లో రిపోర్ట్ చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, నరసింహ, శ్రీకాంత్, శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన ధనుర్మాస పూజలు



ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీగోదా సమేత శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు గురువారం ఘనంగా ముగిశాయి. ఆలయ వేదపండితులు అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం కల్యాణ మండపంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నోము నిర్వహించి ధనుర్మాస పూజలు ముగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు లక్ష్మణాచార్యులు, రాజగోపాలాచార్యులు, అనంతరసేనాచార్యులు, పురుషోత్తమాచార్యులు, అచ్యుతాచార్యులు, శ్రీవాస్తవాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



శామీర్‌పేట్: వాహనదారులకు ఇబ్బంది కలిగేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయరాదని ట్రాఫిక్ ఏసీపీ రాములు అన్నారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ వద్ద రోడ్డును ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

నిలిచిన పనులు..
ఆగిన అభివృద్ధి

- ▲ పూర్తయిన రాజగోపురం తదితర అభివృద్ధి పనులు
- ▲ ఆలయాల పున:నిర్మాణం పనులు మాత్రం పెండింగ్
- ▲ శంకుస్థాపన మధ్యలోనే ఆగిన నిర్మాణం
- ▲ పనులు తిరిగి ప్రారంభించాలని కోరుతున్న భక్తజనం





ఆలయం వద్ద పెండింగ్‌లో ఉన్న మండప నిర్మాణ పనులు

కీసరగుట్ట : తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం ఎండోమెంట్, దాతల సహకారంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు కొన్ని పూర్తికాగా మరికొన్ని పనులు ముందుకు సాగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ మరింత అధికంగా ఉంటుంది. ఇకపోతే శ్రావణమాసం, కార్తీక మాసం, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో అయితే భక్తుల రద్దీ లక్షల్లో ఉండటం జరుగుతుందని.. ఇంత పెద్ద ఎత్తున భక్తుల తాకిడి ఉన్న దేవస్థానం వద్ద కీసరగుట్ట దేవస్థానం అధికారులు, వంశపారంపర్యదర్మకర్తలు, ఎండోమెంట్ శాఖ, దాతల సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నారు. నగరానికి చెందిన ఓ దాత ఇప్పటి వరకు సుమారు 3 నుంచి 4 కోట్లు వెచ్చించి ఆలయం వద్ద భక్తుల అన్నదానప్రసాద కౌంటర్, పరిపాలన భవనం, భక్తులు సేద తీరేందుకు షెడ్లు, అంజనేయస్వామి ఆలయం నుంచి ప్రధాన గోపురం వరకు, అదేవిధంగా కీసరగుట్ట దిగువ నుంచి ఉత్తర ద్వారం వరకు మెట్ల వెంబడి షెడ్లు, ప్రసాదవిక్రయ కేంద్రం, తూర్పు రాజగోపురం తదితర అభివృద్ధి పనులను పూర్తిచేశారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ప్రధాన ఆలయం వద్ద చేపట్టాల్సిన ప్రకార మండపం, దక్షిణ భాగం రాజగోపుర నిర్మాణం, అమ్మవార్ల ఆలయాల పున:నిర్మాణం పనులు మాత్రం పెండింగ్‌లో పడిపోయాయి. కీసరగుట్టలో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్న దాత చేత పెండింగ్‌లో ఉన్న పనులను ఎందుకు పూర్తి చేయించలేకపోతున్నారో ఇటు ఎండోమెంట్ అధికారులు, వంశపారంపర్య ధర్మకర్తలు, భక్తులకు సమాధానం చెప్పలేకపోతున్నారు. గత మూడేళ్ల క్రితం ప్రధాన ఆలయ పక్కనే ప్రస్తుతం ఉత్తరం, దక్షిణ వైపు ఉన్న అమ్మవార్ల ఆలయాలను పున:నిర్మాణంలో భాగంగా ప్రధాన దేవాలయం (స్వామివారి గర్భగుడి)కి ఆనుకొని పశ్చిమ ముఖంలో నిర్మించేందుకు పీఠాధిపతిని కూడా సంప్రదించి అనుమతి కూడా తీసుకున్నారు. కానీ అమ్మవార్ల దేవాలయాల పున:నిర్మాణ పనుల్లో భాగంగా భూమి పూజ సైతం నిర్వహించినప్పటికీ పనులు అక్కడితోనే నిలిచిపోయాయి. దీంతో గత మూడేళ్ల క్రితం ఆలయాల నిర్మాణం కోసం తమిళనాడు నుంచి తీసుకువచ్చిన శిలలు దేవాలయం తూర్పు భాగంలో అలాగే ఉన్నాయి. ఇప్పటికైనా ఆలయ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తటాకం నారాయణ, ఆలయ అధికారులు, ఎండోమెంట్ ఉన్నతాధికారులు, దాతను సమన్వయపరచుకుంటూ అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు.



నిలిచిన అమ్మవార్ల ఆలయ పున: నిర్మాణ పనులు

త్వరలో పనులు ప్రారంభిస్తాం



కీసరగుట్ట దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ఎండోమెంట్, దాతల సహకారంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా మిగిలిన పనులను త్వరలో తిరిగి ప్రారంభిస్తాం. ఈ మేరకు ఎండోమెంట్ ఉన్నతాధికారుల నుంచి అనుమతి కూడా తీసుకోవడం జరిగింది. ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి కూడా పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేలా త్వరలో దాతను కూడా కలిసి పనులు ప్రారంభిస్తాం.

– కీసరగుట్ట ఆలయ చైర్మన్, తటాకం నారాయణ



అమ్మవార్ల ఆలయాల నిర్మాణం కోసం తీసుకువచ్చిన శిలలు ఇవే

వ్యవసాయేతర భూములను జాగ్రత్తగా గుర్తించాలి



క్షేత్రస్థాయి పర్యటన వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

కీసర: క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి వ్యవసాయానికి యోగ్యమైన భూమియేనా కాదా అని జాగ్రత్తగా గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కీసర తహసీల్దారును మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పోట్రు ఆదేశించారు. గురువారం కీసర ఆర్డీఓ కార్యాలయంలో గ్రామాల సర్వే నెంబర్ల వారీగా వ్యవసాయేతర భూములను గుర్తించే క్షేత్రస్థాయి పర్యటనల వివరాలను.. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గౌతం మాట్లాడుతూ.. జీపీఆర్ మ్యాప్‌ను పరిశీలిస్తూ క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి భూములు వ్యవసాయ యోగ్యమైనవో, కావో కచ్చితంగా గుర్తించి సమగ్ర నివేదికను తయారు చేయాలన్నారు. అవసరమైన చోట సర్వేయర్ల నుంచి సమాచారం సేకరించి లేఅవుట్లు, నివాసప్రాంతాలు, పరిశ్రమలకు సంబంధించిన భూముల వివరాలను కచ్చితంగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మ్యాప్‌తో చీర్యాల, గోధుమకుంట గ్రామాల సర్వే నెంబర్ల ద్వారా పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో లా–ఆఫీసర్ చంద్రావతి, కీసర తహసీల్దారు అశోక్ కుమార్, ఆర్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్

ఊరెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల..

5 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు

మేడిపల్లి: ఊరెళ్లొచ్చేసరికి వరుసగా రెండు ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మున్సిపల్ పరిధి తిరుమల మెడోస్ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో నివాసం ఉంటున్న మహమ్మద్ అజీద్, కూరెళ్ల ప్రతాప్ నగరంలో ప్రైవేట్ ఉద్యోగులు. కాగా గత మూడు రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి ఊర్లెళ్లి తిరిగొచ్చేసరికి ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూసేసరికి వారి ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించిన బాధితులు బుధవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకు గురైన యువకుడి మృతదేహం గుర్తింపు

కుషాయిగూడ: చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం హత్యకు గురైన 35 ఏళ్ల యువకుడి వివరాలను పోలీసులు తెలుసుకున్నారు. జార్ఖండ్‌కు చెందిన బాబు సోల్ టాడుగా తేల్చి అతడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. మృతుడి జేబులో లభించిన థర్డ్ పర్సన్ బ్యాంకు నెంబరు ఆధారంగా అచూకీ తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా మృతుడికి వివాహమైందని, భార్యాభర్తలు విడిపోవడంతో వేర్వేరుగా ఉంటున్నట్లు చెప్పారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు వస్తారనే నమ్మకం కనిపించడం లేదని పోలీసులు చెబుతున్నారు. దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నేరేడ్‌మెట్‌లో చైన్ స్నాచింగ్

అల్వాల్: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన పూజిత (25) సంక్రాంతి పండుగకు నేరేడ్‌మెట్ గీతానగర్‌లోని తన అమ్మవారింటికి వచ్చింది. గురువారం మెడికల్ షాపుకి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన దుండగులు ఆమె మెడలోనుంచి 2.5 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

మేడ్చల్‌రూరల్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన షెహనాజ్ పర్వీన్ (15) గత మూడు నెలల నుంచి మేడ్చల్ పారిశ్రామికవాడలోని తన పెద్దమ్మ హర్జాన్ బేగం కుటుంబంతో కలిసి ఉంటోంది. 10వ తరగతి పూర్తి చేసిన పర్వీన్ గత కొన్ని రోజులుగా ఇంటి వద్దే ఉంటుండగా బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లింది. దీంతో పెద్దమ్మ హర్జాన్ బేగం డ్యూటీ నుంచి తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద పర్వీన్ కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పర్వీన్ (ఫైల్)

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



కుషాయిగూడ: రోటరీ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రోటరీ క్లబ్ ప్రతినిధి బబ్బూరి బాలరాజుగౌడ్ 20 కుట్టుమిషన్లను మహిళలకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ అందజేసిన కుట్టుమిషన్లతో ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. బాలరాజుగౌడ్ సేవలను ఎమ్మెల్యే అభినందించారు. కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నేతలు మహేష్‌గౌడ్, నర్సింహ్మా, శ్రీకాంత్‌రెడ్డి, చక్రపాణిగౌడ్ పాల్గొన్నారు.

గట్టుమైసమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన

ఘట్‌కేసర్: పట్టణంలోని గట్టుమైసమ్మ జాతర ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ నెల 19న జరుగనున్న జాతరలో పార్కింగ్ కోసం ట్రాఫిక్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఆలయం పరిసరాలను సిబ్బందితో శుభ్రం చేయించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓ భాగ్యలక్ష్మీ, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, మల్లేష్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జంగారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ డైరెక్టర్ జంగారెడ్డి, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

రూ. 1.43 కోట్లతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో రూ. 1.43 కోట్లతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) నిర్మిస్తున్నట్లు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. గురువారం రాంపల్లిలో ఆరోగ్య కేంద్రం నిర్మించేందుకు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

కీసర: తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ ఉపాధ్యక్షురాలు ఆర్. రాధ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వినతి పత్రం అందజేశారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, పార్లమెంట్‌లో పీఎం నరేంద్ర మోదీకి ఆశా వర్కర్ల సమస్యలను ప్రస్తావించి పరిష్కరించాలని ఈటలతో పాటు మల్లారెడ్డిని కోరారు. ఆశా వర్కర్లకు నెలకు రూ. 18 వేలు జీతం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

సభను విజయవంతం చేయాలి

జవహర్‌నగర్: ఫిబ్రవరి 7న నగరంలో జరిగే లక్ష డప్పులు.. వేల గొంతులు బహిరంగ సభను విజయవంతం చేయాలని కవి గాయకులు దరువు అంజన్న పిలుపునిచ్చారు. గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీసీ కళాకారులు, మేధావుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో లక్ష డప్పులు.. వేల గొంతులు మహా ప్రదర్శన రాష్ట్ర యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా దరువు అంజన్న మాట్లాడుతూ.. 30 ఏళ్ల పోరాట ఫలితం ఎస్సీ వర్గీకరణ అమలు దగ్గరలోనే ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అధికారికంగా అమలు చేయాలని కోరారు. ఈ మహా ప్రదర్శన విజయవంతం చేసేందుకు వేలాది మంది కళాకారులు, రచయితలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, క్రాంతి కళాబృందం రాష్ట్ర అధ్యక్షులు వెంకటాచారి, తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షులు నర్సింహా, ప్రవీణ్‌యాదవ్, రామస్వామి, ప్రణయ్, శివ, వెంకటేష్, నాగేష్, యాదయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేత

మేడ్చల్‌రూరల్: రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను గురువారం రజక సంఘం నాయకులు కలిశారు. రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థల పేరుతో లాండ్రీలు, దోబీల పేరు చలామణి అవుతుండడంతో రజకులు ఉనికి కోల్పోవాల్సి వస్తోందని వెంటనే వాటిని తొలగించి రజక, చాకలి అనే పదాలతో పేర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘాల జేఏసీ చైర్మన్ పంజాగారి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు యుగపతి, జంగయ్య, శ్రీనివాస్, శ్రీశైలం, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పరామర్శ

మేడ్చల్: మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పార్టీ నాయకులను పరామర్శించారు. ఇటీవల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్ అమ్మ మరణించగా దశదినకర్మలో పాల్గొని నివాళులర్పించి పరామర్శించారు. మేడ్చల్ మున్సిపల్ పార్టీ ప్రధాన కార్యదర్శి విష్ణుచారి తండ్రి మరణించడంతో గురువారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, బాబు యాదవ్, గణేష్, నాయకులు పాల్గొన్నారు.



దయానంద్ యాదవ్ మాతృమూర్తికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం డయాలసిస్ సెంటర్‌ను గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభించారు. ఆసుపత్రుల్లో నూతనంగా 5 బెడ్లతో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే డయాలసిస్ బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రిలో పనిచేసే కాంట్రాక్ట్ సిబ్బంది తమకు వేతనాలు సకాలంలో రావడం లేదని ఎంపీకి తెలుపగా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేతనాలు వచ్చేలా చూడాలని ఆసుపత్రి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రఘునాథ్‌సాయి, స్థానిక కౌన్సిలర్ శివకుమార్, జిల్లా గ్రంథాలయాల మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, వైద్యులు పాల్గొన్నారు.



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీ ఈటల

ఆసుపత్రి భవనం పనులను పరిశీలించిన ఎంపీ..

ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఎంపీ ఈటల పరిశీలించారు. శంకుస్థాపన చేసి రెండేళ్లు అవుతున్నా.. పనులు సాగడం లేదని ఎంపీతో పలువురు తెలుపగా ఈ మేరకు పరిశీలన చేశారు. గత 10 రోజుల నుంచి పనులు ప్రారంభించారని అధికారులు తెలుపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, వైద్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.